క్లుప్తంగా

3 నుంచి మెగా క్రికెట్ టోర్నీ

కురుపాం: మండల కేంద్రంలో వచ్చే నెల ఫిబ్రవరి 3వ తేదీ నుంచి పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ అంధవరపు కోటేశ్వరరావు నిర్వహణలో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డి.నవీన్, ఇమ్మానియోల్‌లు ఆదివారం తెలిపారు. పరిమితి ఓవర్ల ఈ టోర్నీలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు 2వ తేదీలోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి టీమ్ సభ్యుల వివలు నమోదు చేసుకోవాలని కోరారు. టోర్నీ విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు బహుమతిగా అందించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 9491293317, 7993912193 లకు సంప్రదించాలని కోరారు.

కిచ్చాడలో పారిశుద్ధ్య పనులు



కిచ్చాడలో కాలువల్లో పూడికలు తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కురుపాం: మండలంలోని కిచ్చాడ పంచాయతీ కేంద్రంలో చురుగ్గా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయచంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ పంచాయతీ కేంద్రంతోపాటు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగిస్తున్నట్లు చెప్పారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పంచాయతీ ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

అంతరపంటల సాగుతో ఆదాయం



గొట్టివలసలో దొండ సాగులో అంతరపంటలు

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు, రావుపల్లి, గరుగుబిల్లి, ఉద్దవోలు, గొట్టివలస, పెద్దూరు, కొత్తపల్లి తదితర గ్రామాల్లో రైతులు కూరగాయ పంటలు సాగు చేస్తూ అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. నేలబావులు, నీటి వసతి ఉన్న పొలాల్లో బెండ, దొండ, బీర, చిక్కువ తదితర కూరగాయలతో పాటు అంతరపంటలుగా పాలకూర, కొత్తిమీర, ముల్లంగి తదితర పంటలను సాగు చేస్తున్నారు. దీని వల్ల ఇంటికి కావాల్సిన కూరగాయలతో పాటు అదనపు పంటను ఇతరులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందుతున్నారు. అయితే ఈ ప్రాంతంలో సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో పంటను విక్రయించేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతులు కల్పిస్తే మరింత మంది రైతులు కూరగాయలు సాగుపై ఆసక్తి చూపేందుకు సిద్ధంగా ఉన్నారు.

గజరాజుల కదలికలపై నిఘా

భామిని: గజరాజుల గుంపు గ్రామాల్లోకి రాకుండా అటవీశాఖ అధికారులు వాటిపై నిఘా పెట్టారు. తివ్వాకొండల్లో ఏనుగుల గుంపు కదలికలను ఎలిఫాంట్ ట్రాకర్లు, అటవీశాఖ అధికారులు అనుక్షణం గమనిస్తున్నారు. కొండపై ఉన్న ఏనుగులు దిగువన ఉన్న మైదాన ప్రాంతానికి రావాలంటే వంశధార ప్రాజెక్టు వరదకాలువపై ఉన్న వంతెన దాటాల్సి ఉంటుంది. దీంతో అటవీశాఖ సిబ్బంది మాసగూడ, తాటిమానుగూడ, నల్లరాయిగూడల వద్ద గల వంశధార వరద కాలువ వంతెనలపై గస్తీ ఏర్పాటు చేశారు. మూడు రోజుల క్రితం తాలాడ, ఘనసర సమీపంలోని ఏనుగుల గుంపు సంచరించి పంటలు ధ్వంసం చేశాయి.

పామాయిల్ సాగులో మెలకువలు పాటించాలి



తోటబడి నిర్వహిస్తున్న ఉద్యానఅధికారి ప్రత్యూష

సీతానగరం: రైతులు మాగాణీ భూముల్లో నాటిన పామాయిల్ తోటల పెంపకంపై మెలకువలు పాటించాలని మండల ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష అన్నారు. మండలంలోని తామరఖండి, గుచ్చిమి గ్రామాల్లో ఆదివారం ఉద్యాన పంటలసాగుపై రైతులకు తోటబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. తామరఖండి వద్ద పామామయిల్‌తోటలో జరిగిన కార్యక్రమంలో రైతుల నుద్దేశించి మాట్లాడుతూ.. ఏపుగా పెరుగుతున్న పామాయిల్ మొక్కలకు జనవరి, ఫిబ్రవరి,మార్చి నెలల్లో తెల్లదోమ ఆశించి పంటనష్టం కలిగించే అవకాశం ఉందని, రైతులు సకాలంలో తెల్లదోమను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వేపనూనె పిచికారీ చేయడం, తోటల్లో పసుపు రంగులో ఉన్న గుడ్డలను కట్టడం ద్వారా దోమ వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. ఎరువుల వాడకం, నీటియాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా దిగుబడి పెరుగుతుందన్నారు. మండలంలోని బగ్గందొరవలసలో శ్రీనివాసా పామాయిల్ నర్సరీలో రైతులకు మొక్కలు అందుబాటులో ఉన్నట్లు తెలియజేశారు.

చైనా ఉప్పు.. తప్పదు ముప్పు

- ఫాస్ట్‌ఫుడ్ తయారీలో పెరుగుతున్న టేస్టింగ్ సాల్ట్ వినియోగం
- తరచూ తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వాడుతున్న చైనా సాల్ట్

భామిని: మీరు తరచూ ఫాస్ట్‌ఫుడ్ తింటున్నారా? అయితే మీ ఆరోగ్యం జాగ్రత్త. ఎందుకంటే మనం నిత్యం తినే ఫాస్ట్‌ఫుడ్‌లో రుచి కోసం టేస్టింగ్ సాల్ట్ (అజినోమోటో)ను వినియోగిస్తుంటారు. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. చైనా నుంచి దీన్ని దిగుమతి అవుతున్నందున దీన్ని చైనా సాల్ట్‌గా పిలుస్తుంటారు. ఇందులో అజినోమోటోలో 'మోనో సోడియం గ్లుటామేట్' అనే రసాయం ఉంటుంది. దీన్ని ఆహార ఉత్పత్తుల పేరుతో కాకుండా ఫెర్టిలైజర్ పేరుతో మన దేశంలోకి దిగుమతి అవుతోంది. దీన్ని ఆహారంలో వినిగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలను చైనా ప్రభుత్వం గుర్తించి దీన్ని ఆహార ఉత్పత్తుల జాబితా నుంచి తొలగించింది. కానీ మన దేశంలో దీన్ని వంటకాల్లో రుచి కోసం విరివిగా వినియోగిస్తున్నాం. ఒక్క ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోనే కాదు, హోటళ్లు, రెస్టారెంట్లు, విందు భోజనాల్లో రుచి కోసం దీన్ని వినియోగించడం పరిపాటిగా మారింది.

ఆరోగ్య సమస్యలు..

టేస్టింగ్ సాల్ట్‌తో చేసిన ఆహార పదార్థాలను తరచూ తినే వారి శరీరంలో ఈ మోనో సోడియం గ్లుటామేట్ పేరుకుపోయి బీపీ, సుగర్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. అధిక మొత్తంలో తీసుకునేవారిలో తలనొప్పి, ముఖం ఎర్రబారడం (ఫ్లషింగ్), చెమటలు పట్టడం, గుండెదడ, ఛాతీలో నొప్పి, వికారం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. వాటన్నింటినీ కలిపి 'ఎంఎస్‌జీ సింప్టమ్ కాంప్లెక్స్'గా పేర్కొంటారు. పై లక్షణాలు కనిపించే ఆ కండిషన్‌ను 'చైనీస్ రెస్టారెంట్ సింద్రోమ్' అంటారు. అలాగే నాలుకపై ఉన్న రుచి గ్రాహకాలు వాటి శక్తిని కోల్పోవడం, మొదడు మొద్దుబారిపోవడం, కంటిచూపు మందగించడం కూడా జరగవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రుచుల కోసం వాడొద్దు..



టేస్టింగ్ సాల్ట్‌గా పిలిచే అజినోమోటోను రుచి కోసం వంటకాల్లో వాడొద్దు. రుచికరంగా ఉందని దీన్ని వాడితే క్రమంగా ఆరోగ్యం పాడవుతుంది. పిల్లలపై తీవ్ర ప్రభావం చూపే అజినోమోటోను ప్రభుత్వాలు నియంత్రించాలి. దీర్ఘకాలిక వ్యాధులకు కారణమయ్యే దీన్ని విందు భోజనాల్లో వాడకుండా చూడాలి.

– డాక్టర్ కె.విజయపార్వతీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సీతంపేట

మొక్కజొన్నలో కత్తెరపురుగు నివారణ



మొక్కజొన్న పంటలో కత్తెరపురుగు ప్రభావాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారులు

భామిని: రబీలో అపరాలతో పాటు రెండో పంటగా మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పాలకొండ నియోజకవర్గంలో ఏటా మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వరి కోతలు పూర్తయిన పొలాల్లో జీరో టిల్లేజ్ (దుక్కి దున్నకుండా విత్తనాలు నాటే పద్ధతి)లో రైతులు విత్తనాలు నాటారు. ప్రస్తుతం పంట మొలక దశలో ఉంది. అయితే మొక్కజొన్నలో ఏదశలో అయినా కత్తెరపురుగు ఆశించే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారి కొర్ను సింహాచలం సూచించారు. కత్తెరపురుగు ఆశించినట్లు గుర్తించిన వెంటనే సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. లేదంటే పంట మొత్తానికి వ్యాపించే అవకాశం ఉంది. దీని వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోయి రైతుకు నష్టం జరుగుతుంది.

నివారణ చర్యలు..

కత్తెరపురుగు నివారణ కోసం ఒక లీటరు నీటిలో 5 మిల్లీలీటర్ల వేపనూనె కలిపి ఆకులు తడిచేలా పిచికారీ చేసుకోవాలి. లేదా స్పెనోశాడ్ 3 ఎం.ఎల్ ద్రావకం లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఇమమెక్టిమ్ బెంజోయేట్ 4గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి చల్లుకున్నట్లయితే పురుగు వ్యాప్తిని అడ్డుకోవచ్చు. ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో మందును పిచికారీ చేసుకోవడం మంచిది.

అభివృద్ధి పనులు వేగవంతం

- మంత్రి పీడిక రాజన్నదొర



సాలూరు: రాష్ట్రంలో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. పట్టణంలోని తన గృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించామన్నారు. ఇందులో భాగంగా వివిధ నిర్మాణ దశల్లో ఉన్న రోడ్లను త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని పలు గిరిజన ప్రాంతాల్లో వివిధ కారణాలతో నిలిచిన 149 రోడ్ల పనులు త్వరితగతిన చేపట్టనున్నట్లు చెప్పారు.

విద్యార్థిని అదృశ్యం

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ. నరేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. చింతపల్లి బర్రిపేటకు చెందిన విద్యార్థిని ఈ నెల 28న ఉదయం ఎనిమి ది గంటల సమయంలో పాఠశాలకు వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరింది. అయితే విద్యా ర్థిని సాయంత్రం ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు సమీప గ్రామాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధికే ప్రాధాన్యం



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: అభివృద్ధికే ప్రాధాన్యమిస్తున్న ఏకై క ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పార్వతీపురం మండలంలోని లచ్చిరాజుపేట గ్రామంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా ఆత్మీయస్వాగతం పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా... రైతు భరోసా వచ్చిందా..పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా.. అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాలవి అర్థం లేని ఆరోపణలు

అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి ఏదోఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్న నాయకులు బాదుడే బాదుడు అంటూ మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టడం విచాకరమని ఎద్దేవా చేశారు. ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు వెంపలి గుర్రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండడమే ధ్యేయం

- ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: పేదలకు అండగా ఉండడమే తననైజమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని తామరఖండి పంచాయతీ మధుర గ్రామమైన రేపటివలసలో జరుగుతున్న రోడ్డుపనులను సందర్శించిన అనంతరం గ్రామంలోని పేదలకు చీర, రూ500 వంతున కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటివలసలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన సమయంలో అక్కాచెల్లెళ్లను కలుసుకుంటానని హామీ ఇచ్చానన్నారు. పండగ సమయంలో పనుల ఒత్తిడి కారణంగా రాలేక పోయాయనని తెలియజేశారు. గ్రామానికి తారురోడ్డు వేయిస్తూ ఇచ్చిన హామీ నెరవేర్చినట్లు చెప్పారు. అలాగే ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా అండగా తానుంటానని, మీరంతా జగనన్నకు అండగా ఉండి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించడానికి దీవించాలని కోరారు. కార్యక్రమంలో రేపటివలస వైఎస్సార్‌సీపీ నాయకులు బి.వినయ్‌కుమార్, పార్వతీపురం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బి.రమేష్, పార్టీ నాయకుడు బి.నాగేశ్వరరావు, బందలుప్పి సర్పంచ్ వై. ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రోజుకు 3 వేల మందికి ఉపాధి



వేతన దారుల మస్తరును పరిశీలిస్తున్న ఏపీఓ నాగలక్ష్మి

సీతానగరం: మండలంలో రైతులు వ్యవసాయపనుల్లో ఉన్నందున రోజుకు 3,409 మంది వేతనదారులు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని ఏపీఓ నాగలక్ష్మి తెలియజేశారు. మండలంలోని పెదభోగిలి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. మస్తర్లను తనిఖీ చేసి పనికి హాజరైన వేతనదారుల సంఖ్యతో సరిచూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనదారులు పనులు చేసినట్లయితే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. రెండు పూటలా పనులు చేయాలని, సమయ పాలన పాటించాలని, ఇచ్చిన కొలతలు పూర్తిచేయాలని సూచించారు. జాబ్ కార్డులున్న వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం మట్టి రోడ్డు అభివృద్ధి, చెరువుగట్టు, గోర్జ పనులు, ప్రారంభించామన్నారు. 35 పంచాయతీల్లో గ్రామసభల్లో గుర్తించిన 57 పనులు జరుగుతున్నాయని తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



శతాధిక వృద్ధుడు సత్యనారాయణను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. తోటపల్లి ఆలయ ప్రాంగణంలో ఆదివారం టెంపుల్ డవలప్‌మెంట్ సేవా ట్రస్ట్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తోటపల్లి ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తానని, అలయానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా తోటపల్లికి చెందిన శతాధిక వృద్ధుడు రొక్కం సత్యనారాయణతో పాటు 60 ఏళ్ల క్రితం దేవాలయ నిర్మాణానికి కృషిచేసిన వంద మంది దాతలను సన్మానించారు. మూడేళ్ల బాలుడు వేంకటేశ్వర స్వామి వేషధారణలో వేసిన ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. సమావేశంలో మేనేజింగ్ ట్రస్టీ డి.ధనుంజయనాయుడు, జెడ్పీ వైస్ చైర్మన మరిశర్ల బాపూజీ నాయుడు, డి.పారినాయుడు, సర్పంచ్‌లు వాల సింహాచలం, అంబటి రాంబాబు, ఎంపీటీసీలు ఎం.సింహాచలంనాయుడు, ఆర్నిపల్లి గంగాధర్‌నాయుడు, శ్రీనివాసరావుతోపాటు ట్రస్టీలు, దాతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



మహిళలతో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన

పార్వతీపురం: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో ఆదివారం ఆయన పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. అప్పడాల తయారీ, నువ్వుల శుద్ధి, చేపల వ్యాపారం, తదితర పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్న మహిళలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహళలకు సున్నా వడ్డీ క్రింద మంజూరు చేస్తున్న రుణాలను చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటుచేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు పక్కా గృహాలను నిర్మించేందుకు చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం టిడ్కో చైర్మన్ జమ్మానను ప్రజలు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మజ్జి పారినాయుడు, పైడపునాయుడు, రమణయ్య తదితరులున్నారు.

జ్ఞాపకాల ఒడిలో..



వీరఘట్టం: అరె నువ్వేనా..ఎంత లావుగా ఉండేవాడివి..పీలగా అయిపోయావేరా.. చిన్నప్పుడు తెగ వాగేవాడివి..ఇప్పుడు మౌనంగా ఉన్నావేం.. ఎంత మారిపోయావురా..గుర్తు పట్టలేకయాను.. అంటూ ఒకరు. నువ్వేం చేస్తున్నావు.. భార్యాపిల్లలు ఎలా ఉన్నారు.. అంటూ మరొకరు ఇలా కుశల ప్రశ్నలు, ఆత్మీయ పలకరింపులతో వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. పాఠశాలలో 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. 15 ఏళ్ల వయసులో కలిసి చదువుకున్న స్నేహితులను చూసి మురిసిపోయారు.

అప్రమత్తంగా ఉండండి

- ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్



గాజులరేగ సమీపంలో కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్

విజయనగరం క్రైమ్: రైల్వే ట్రాక్‌లు దాటే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల ని ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్ అన్నా రు. స్థానిక గాజులరేగ, నెల్లిమర్ల మధ్య రైల్వేట్రాక్‌ల సమీపంలో ఉన్న ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతేడాది ఇదే ట్రాక్ దాటుతూ ఎనిమిది మంది వరకు మృతి చెందారన్నారు. రైలు వచ్చే పరిస్థితి తెలియకపోవ డంతో చాలా మంది చనిపోతున్నారని, అలాగే అధిక సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారన్నారు. ట్రాక్ దాటాలనుకుంటే బ్రిడ్జిలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీలు తాలాడ శ్రీనివాసరావు, లోచన, తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా 'జగనన్న గోరుముద్ద'

- వారంలో 3 రోజుల పాటు విద్యార్థులకు రాగి మాల్ట్
- మార్చి 1 నుంచి అందించాలని ప్రభుత్వం ఆదేశం



జగనన్న గోరుముద్ద తింటున్న విద్యార్థులు (ఫైల్)

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత మెరుగైన పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే జగనన్న గోరుముద్ద ద్వారా పౌష్టికాహారం అందిస్తున్న జగనన్న సర్కారు వారంలో మూడు రోజుల పాటు రాగి మాల్ట్ ఇవ్వాలని నిర్ణయించింది. తద్వారా విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి అవసరమైన కాల్షియం, ఐరన్, తదితర పోషకాలను అందించడానికి అధికారులు సమయాత్తమవుతున్నారు. ఈ మేరకు మార్చి 1వ తేదీ నుంచి వారంలో మూడు రోజుల పాటు బెల్లం కలిపిన రాగి జావ అందించాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేగాకుండా అన్ని పాఠశాలలకు సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే ఇకపై సరఫరా చేస్తారు.

నెల్లిమర్ల నియోజకవర్గంలోని నెల్లిమర్ల నగర పంచాయతీ, నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో మొత్తం 260 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 27 వేల మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. ఆహారం లేక విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజనాన్ని మరింత మెరుగు పర్చింది. వారంలో ఆరు రోజుల పాటు కోడిగుడ్లు, ప్రతిరోజూ ఆకుకూరలు, కాయగూరలు, పప్పు, తదితర పోషకాలు అందించాలనే లక్ష్యంతో భోజనంలో పలు మార్పులు చేసింది. అంతేగాకుండా విద్యార్థులు ఇష్టంగా తినాలనే ఉద్దేశంతో బిర్యానీ, కిచిడి, పులిహోర, పలావు, స్వీట్ పొంగల్, తదితర వంటకాలను విద్యార్థులకు అందిస్తోంది. దీంతో గతంలో మధ్యాహ్న భోజనం తినడానికి ఇష్టపడని విద్యార్థులు సైతం జగనన్న గోరుముద్దను ఇష్టంగా తింటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న జగనన్న గోరుముద్దను మరింత మెరుగ్గా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల్లో కాల్షియం, ఐరన్ లోపాలను నివారించాలనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనంతో పాటు అదనంగా రాగి జావ అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రోజు తప్పించి రోజు వారంలో మూడు రోజుల పాటు ఒక్కో విద్యార్థికి గ్లాస్ రాగిజావ అందించాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీచేసింది. విద్యార్థులు ఇష్టంగా తాగడానికి బెల్లం కలపాలని నిర్వాహకులను ఆదేశించింది. ఈ మేరకు మార్చి 1వ తేదీ నుంచి రాగిజావ అందించనున్నారు. అలాగే జగనన్న గోరుముద్ద నిర్వహణకు సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నియోజకవర్గంలోని 27 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

రాగి జావతో ఆరోగ్యం



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాగి జావ అందించడం ఎంతో ప్రయోజనకరం. రాగి జావ తీసుకోవడం వల్ల పిల్లల్లో కాల్షియం, ఐరన్ లోపం నివారించవచ్చును. అంతేగాకుండా రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. జ్ఞాపకశక్తి పెరిగి, చదువులో మరింత చురుకుగా మారుతారు.

–డాక్టర్ కె. శ్రీనివాసరావు, డిప్యూటీ సివిల్ సర్జన్, నెల్లిమర్ల సీహెచ్‌సీ